క్లుప్తంగా

రైల్వే స్టేషన్ సమీపంలో చెత్తకు నిప్పు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ పక్కనే ఉన్న గోడ వద్ద భారీగా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలకు మంగళవారం నిప్పు అంటుకోవటంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి నష్టం లేదని ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు.

ఆత్మీయ కలయిక


మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు

భీమడోలు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ కేంద్రం కార్యాలయంలో పూళ్ల ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావుతో పాటు కురెళ్లగూడెం, కోడూరుపాడు పార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఒక్కొక్కరినీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆప్యాయంగా పలికరించారు. పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని, శ్రేణులకు తాను అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారని, చాలా సంతోషంగా ఉందని నాయకులు తెలిపారు. స్థానిక పార్టీ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారని, ఆయన చూపిన అభిమానం మరవలేనిదని వారు తెలిపారు.

దేవుని ఆజ్ఞలకు అనుగుణంగా జీవించాలి


మాట్లాడుతున్న పాస్టర్ విలియం

దెందులూరు: కొవ్వలి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం బెతస్థ ప్రార్థన మందిరం పాస్టర్ పండుగల నిర్వాహకులు సీహెచ్ విలియం ఆధ్వర్యంలో దీవెనల పండుగలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన గుడివాడ సువార్తికులు జార్జ్ బుష్ మాట్లాడుతూ దేవుని ఆజ్ఞలను ప్రతి ఒక్కరూ నిబద్ధతతో అనుసరిస్తూ జీవించాలన్నారు. మోక్ష మార్గం, సేవా తత్వం, ప్రేమ, ఆదరణ, నిరంతర, ప్రార్థనతోనే దేవుని దీవెనలు లభిస్తాయన్నారు. నిర్వాహకులు బెతస్థ ప్రార్థన మందిరం చర్చి పాస్టర్ సీహెచ్ విలియం మాట్లాడుతూ దేవుని ఆజ్ఞలకు అనుగుణంగా దైవ సేవకుల ఆధ్యాత్మిక సూచనలు సలహాలను పాటించాలన్నారు. ఏలూరు, దెందులూరు, భీమడోలు, పెదపాడు, పెదవేగి మండలాల నుంచి విశ్వాసులు హాజరయ్యారు

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

పెదవేగి : అమ్మపాలెం, దుగ్గిరాల గ్రామాల్లో వ్యవసాయశాఖాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతుల సమక్షంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ వారి ద్వారా ప్రతి రైతుకి ఒక విశిష్ట సంఖ్య ఇవ్వాలనే ఉద్దేశంతో రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇకపై ఏ ప్రభుత్వ పథకం వర్తించాలన్నా విశిష్ట సంఖ్య ఉపయోగపడుతుందని తెలిపారు.

అటకెక్కిన జంబో షెడ్డు నిర్మాణం

- నిధులు విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ఆటంకం
- వైఎస్సార్‌సీపీ హయాంలో పనులు ప్రారంభం


ఏలూరు మార్కెట్ యార్డ్‌లో నిలిచిపోయిన జంబో షెడ్డు నిర్మాణ పనులు


నిరుపయోగంగా ఉన్న మెటీరియల్

ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వం రాకతో ఏలూరు మార్కెట్ యార్డ్ అభివృద్ధి అటకెక్కింది. వైఎస్సార్ సీపీ హయాంలో జంబో షెడ్డు నిర్మాణం చేపట్టారు. పూర్తి చేసిన పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపేశారు. ఫలితంగా ఆసియాలోనే అతిపెద్ద నిమ్మకాయల మార్కెట్ యార్డు పురోభివృద్ధికి అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ షెడ్డు పూర్తి కాకపోవడంతో రానున్న వేసవిలో యార్డ్‌కు తరలించే నిమ్మకాయలు, పండ్లు ఎండకు ఉండిపోతాయని, నాణ్యత, తేమశాతం తగ్గి కొనుగోళ్లు తగ్గిపోయి తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పనులు 20 శాతం పూర్తి

గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. మార్కెట్ యార్డ్‌లో జంబో షెడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. రైతులు తరలించే నిమ్మకాయలు, పండ్లకు నీడ ఇచ్చేల షెడ్డు నిర్మించేందుకు అధికారులు సుమారు రూ.3.40 కోట్లతో ప్రణాళిక రూపొందించారు. పాత షెడ్డు పక్కన సుమారు 100 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో పనులు చేపట్టారు. పునాదులు తీసి, పిల్లర్లు వేశారు. సుమారు 20 శాతం పనులు పూర్తయ్యే నాటికి సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. పూర్తి చేసిన షెడ్డు పనులకు నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. మరో 80 శాతం పనులు చేయాల్సి ఉంది. షెడ్డు పరిసరాల్లో ఇసుక, ఐరన్, చిప్స్ తదితర సామగ్రి నిరుపయోగంగా ఉంది. పిచ్చిమొక్కలు మొలిచి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నాయి.

జగన్ హయాంలోనే అభివృద్ధి



మార్కెట్ యార్డ్‌లో జంబో షెడ్డు నిర్మాణ పనులు గత ప్రభుత్వం అనుమతితో ప్రారంభించాం. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయించారు. ఈ నిధులు కూటమి ప్రభుత్వం విడుదల చేసి షెడ్డు నిర్మాణం పూర్తి చేయాలి. లేదంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఏ ప్రభుత్వం వచ్చినా అభివృద్ధి కొనసాగాలన్నదే మా అభిమతం.

– నెరుసు చిరంజీవులు, ఏఎంసీ మాజీ చైర్మన్

నిధులు విడుదల కాలేదు



గత ప్రభుత్వ హయాంలో రూ.3.40 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు పనులు 20 శాతం పూర్తయ్యాయి. ఈ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల కాలేదని కాంట్రాక్టన్ పనులు ఆపేశారు. కొత్త ప్రభుత్వం త్వరలో నిధులు విడుదల చేస్తుందని భావిస్తున్నాం. నిధులు విడుదల కాగానే పనులు పునఃప్రాంభిస్తాం.

– కె.శారదారాణి, కార్యదర్శి, ఏఎంసీ

ఎన్‌సీటీఈఎల్‌లో ఆర్‌సీఈకి ఏ గ్రేడ్


గుర్తింపు పత్రం అందుకుంటున్న రామచంద్ర ప్రతినిధి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గతేడాది ఎన్‌సీటీఈఎల్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల ఏ గ్రేడ్‌తో పాటు, ఆస్పిరెంట్ స్థాయిని పొందిందని కళాశాల చైర్మన్ కె.వేణుగోపాల్, ఎండీ కె.సాయి రోహిత్, ప్రిన్సిపాల్ ఎం మురళీధరరావు తెలిపారు. ఈ మేరకు ఇటీవల చెన్నై ఐఐటీలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రతినిధి ఆస్పిరెంట్ గుర్తింపు పత్రం, జ్ఞాపిక అందుకున్నారని ఎన్‌సీటీఈఎల్ లోకల్ చాప్టర్ కో–ఆర్డినేటర్, అసోసియేట్ ప్రొఫెసర్ జి.ప్రభు పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో టాపర్లకు వివిధ ఐఐటీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం ఉంటుందని వివరించారు. ఎన్‌సీటీఈఎల్ పరీక్షల్లో ఎలైట్, ఎలైట్ సిల్వర్, ఎలైట్ గోల్డ్, టాపర్లుగా నిలిచిన విద్యార్థులను కళాశాల డీన్ అకడమిక్స్ కేఎస్ శర్మ, డీన్ ఇంటర్నల్ అఫైర్స్ బి.ప్రసాదబాబు, డీన్ ప్లేస్‌మెంట్స్ ఎ.చిరంజీవి, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి


సదస్సులో పాల్గొన్న డ్రైవర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం డీటీసీ కార్యాలయంలో నగరంలోని ఆటో, మ్యాక్సీ, హెవీ డ్రైవింగ్ స్కూల్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీటీసీ కరీం మాట్లాడుతూ ప్రతి వాహనచోదకుడు రహదారి భద్రత నియమాలను పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదానికి గురైనవారిని రక్షించేందుకు మొదటి 60 నిమిషాల సమయం ఎంతో విలువైందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం నేరమని తెలిపారు. ఆర్టీఓ కేఎస్ఎంవీ కృష్ణారావు, పరిపాలన అధికారులు ఎం రాము, ఎం ఆనంద్ కుమార్, వాహన తనిఖీ అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని రుచిగా సిద్ధం చేయాలి


పూళ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

భీమడోలు: పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ ఆకస్మిక తనిఖీ చేసారు. పాఠశాలలో తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని చిన్నారులతో కలిసి ఆమె రుచి చూశారు. మరింత నాణ్యతగా, రుచిగా వండి, విద్యార్థులకు అందించాలని ఎండీఎం నిర్వాహకులకు ఆమె సూచించారు. పాఠశాలలో ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం నాణ్యతపై బాలబాలికలను అడిగి తెలుసుకున్నారు. పోషక విలువలు గల ఆహారాన్ని అందిస్తున్నందున ప్రతి ఒక్కరూ తినాలని విద్యార్థులకు సూచించారు. తొలుత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షల నిర్వహణను ఆమె పరిశీలించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు పాఠశాల నుంచి 103 మంది రాస్తున్నాయని హెచ్‌ఎం పెనుగొండ భువనేశ్వరరావు డీఈవోకు వివరించారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని హెచ్‌ఎంను కోరారు. పాఠశాలకు సంబంధించిన పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత గణిత ల్యాబ్‌ను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకున్న ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వారంతా ఉత్తీర్ణతా సాధించేలా కృషి చేయాలని డీఈవో టీచర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎండీఎం సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల విగ్రహాలను ఏర్పాటుచేయాలి


ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహాలను గ్రామగ్రామానా ఏర్పాటుచేసి ఆయన ఖ్యాతిని భావితరాలకు అందించాలని భీమవరం జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు సూచించారు. ఘంటసాల 51వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి ప్రాంగణంలో నిర్వహించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఘంటసాల పాడిన పాటలు ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నాయన్నారు. హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం సాహిత్య మండలి ఆవరణలో ఘంటసాల విగ్రహం నెలకొల్పి, ఏటా ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. తొలుత సాహిత్య మండలి ప్రాంగణంలోని ఘంటసాల విగ్రహానికి ఘంటసాల సంగీత కళాశాల అధ్యక్షురాలు విష్ణువఝుల రేవతి, వి.రామ్ కుమార్, వల్లకవి శ్రీనివాసరావు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. గాయకులు శ్రీహరి కోటి తదితరులు ఘంటసాల మధుర గీతాలను పాడి నివాళులర్పించారు. సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

పవిత్ర జీవనం గడపాలి


ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ఫాదర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మేరీమాత పవిత్ర కన్య అని, విశ్వాసులంతా ఆమెలా జీవనం గడపాలని నూజివీడు విచారణకర్త ఫాదర్ లాము జయరాజు అన్నారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి మాత కథీడ్రల్ చర్చి వార్షికోత్సవాలు, లూర్థుమాత పండుగల మూడో రోజు కార్యక్రమాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమలోద్భవి కథీడ్రల్ విచారణకర్త ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడకల్లో సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ మాట్లాడుతూ విశ్వాసులు క్రీస్తు ప్రభువులా నిస్వార్థ బుద్ధితో, ఒకరిపట్ల ఒకరు ప్రేమ కలిగి జీవించాలని అన్నారు. తొలుత స్థానిక సెయింట్ ఆన్స్ కాన్వెంట్ నుంచి లూర్థుమాత స్వరూపంతో అమలోద్భవి కథీడ్రల్ వరకు తేరు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం యవ్వనస్తులు ప్రదర్శించిన సాంస్కృతిక ఉత్సవాలు ఆకర్షించాయి. ప్రత్యేక అతిథి ఫాదర్ లాము జయరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ బి.రాజు, ఆర్ మరియ జోజి, ఫాదర్ పి.జాకబ్, ఫాదర్ పి.జోసఫ్, డి.అబ్రహాం, జె.బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

● ఆకర్షిస్తున్న బిళ్ల బంట్రోతు



ఏలూరులో వందేళ్ల చరిత్ర గల పవరుపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వాసుదేవస్వామి ఆలయంలో ఎడమ వైపున మెడలో బిళ్ల వేసుకుని కూర్చొని ఉన్న ఈ విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. 70 ఏళ్ల నాటి విశేషాలను గుర్తు చేస్తుంది. జీవకళ ఉట్టిపడేలా ఉన్న ఈ విగ్రహం వాసుదేవుని సేవలో తరించేలా కనిపిస్తుంది.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

అలరించిన కూచిపూడి నృత్యాలు


చిన్నారుల కూచిపూడి నృత్య విన్యాసం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో 93వ వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరే రామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత్య కల్యాణం నిర్వహించారు. నగరానికి చెందిన దుర్గా సప్తశతి బృందంచే పాదర్తి జ్యోతి ఆధ్వర్యంలో హనుమంతునికి మన్యుసూక్త పారాయణ చేశారు. హనుమంతునికి సామూహికంగా పానకంతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మినీ సుందరకాండ పారాయణం, సువర్చలాదేవికి శ్రీ సూక్తంతో కుంకుమ పూజ, సౌందర్యలహరి పారాయణ చేశారు. సాయంత్రం నగరానికి చెందిన ద్వారకామాయి భజన బృందం ఆధ్వర్యంలో భక్తి భజన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి నాట్య భారతి అకాడమీ ఆధ్వర్యంలో దివ్య సుహాసిని శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి.

ఎన్నికల హామీల అమలును విస్మరించిన ప్రభుత్వం

దెందులూరు: వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు, బాధితులకు అండగా ఉంటానని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జోగన్నపాలెం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అబ్బయ్య చౌదరిని కలిశారు. జోగన్నపాలెంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెలకొన్న పరిస్థితులను వివరించారు. ప్రభుత్వ పథకాలు రద్దు చేసేందుకు విచారణ పేరుతో ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఏడు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజలకు తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి వచ్చిందన్నారు. అన్ని పరిస్థితులను ప్రజలందరూ గమనిస్తున్నారని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన వారికి గుణపాఠం తప్పదని కొఠారు అన్నారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు సూచించారు.

సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం



వేడుకలో పాల్గొన్న సీఆర్‌ఆర్ విద్యార్థులు, అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవాన్ని ఫిబ్రవరి 11న 180 దేశాలు పాటిస్తున్నాయని నేషనల్ ఇన్ఫార్మెటిక్స్ సెంటర్ డీఐఓ భానుప్రకాష్ అన్నారు. మంగళవారం స్థానిక సీఆర్ రెడ్డి కళాశాలలో నిర్వహించిన సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవంలో భానుప్రకాష్ మాట్లాడారు. మెరుగైన ఇంటర్నెట్ కోసం డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణకు 2025 ముసాయిదాను భారత ప్రభుత్వం జనవరిలో విడుదల చేసిందని తెలిపారు. తద్వారా వ్యక్తిగత సమాచార గోప్యత పౌరుల ప్రాథమిక హక్కుగా గుర్తిస్తారని చెప్పారు. అభ్యంతరకర సమాచారం, చిత్రాలు, వీడియోలను ఇంటర్నెట్ ఆన్‌లైన్ నుంచి తొలగించమని కోరే హక్కును డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం 2023 సెక్షన్–12(3) కల్పిస్తుందని వివరించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఇంటర్నెట్ ఉపయోగించే అంశాలను తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, కో–ఆర్డినేటర్ ఏడీఐఓ సుజాత, కాలేజి విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	24
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	33
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – తిరుపతి	16.00	4830	32

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాత రవితేజకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు మంగళవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన యమ్మనూరు రవితేజ ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచారి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మన్యం బంద్ విజయవంతం

వేలేరుపాడు: 1/70 పరిరక్షణకు రాష్ట్ర అఖిలపక్ష ప్రజా సంఘాల పిలుపులో భాగంగా బంద్ విజయవంతమైంది. వేలేరుపాడు మండల కేంద్రం నుంచి మేడేపల్లి వరకు బైక్ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్మల రమేష్ అధ్యక్షత వహించారు, గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు కారం ధారయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడివి దుర్గారావు, ఆదివాసీ మహాసభ మండల అధ్యక్షుడు మొటకు రాంబాబు, జీఎస్పీ మండల అధ్యక్షులు బంధం ప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల భూములు అన్యాక్రాంతమయ్యాయని, ప్రభుత్వ అధికారుల అసమర్థతతో నేడు అక్రమ కట్టడాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ప్రభుత్వం భవిష్యత్‌లో ఆదివాసీలకు రక్షణగా ఉండే చట్టాలను నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతోందని ఆదివాసీ సమాజం భావిస్తుందన్నారు. దీనికి కొనసాగింపుగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గిరిజనేతరులు సంఘాలు పెట్టాలని సూచించడం దారుణమన్నారు.

అబాకస్‌లో వేదాక్షిత ప్రియ ప్రతిభ

దెందులూరు: రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో దెందులూరు సెయింట్ మేరీస్ ఇంగ్లిష్ మీడియం యూపీ పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని వేదాక్షిత ప్రియ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. విజయవాడ మనం కల్యాణ వేదికలో ఎడ్యుటెక్ సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో ప్రియ విజయం సాధించటం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ సిస్టర్ టీనా మరియ అన్నారు. విద్యార్థిని ప్రియను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.